సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ; 28 ; జూలై ; 2023



సోమశిలలో 24.41 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో 24.41 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1018 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,532
3శాతం జీఎస్టీతో	రూ.5,698
నవర (8గ్రా)	రూ.45,584

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

వాతావరణంలో తేమ 64 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా కొన్ని మండలాల్లో చిరుజల్లులు శుక్రవారం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రైతులకు సల్ఫర్ కోటెడ్ యూరియా సరఫరా



మాట్లాడుతున్న సుధాకర్‌రాజు

మనుబోలు: రైతులకు ఇక నుంచి సల్ఫర్ కోటెడ్ యూరియాను సరఫరా చేయనున్నామని వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో మనుబోలులోని రవి ఫర్టిలైజర్స్ వద్ద అవగాహన సదస్సును వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గురువారం నిర్వహించారు. ప్రధాని సందేశాన్ని రైతులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒక్కో యూరియా బస్తా తయారీకి రూ.2600 ఖర్చవుతుందని, అయితే దీన్ని సబ్సిడీపై రూ.266కే ప్రభుత్వం అందజేయనుందని పేర్కొన్నారు. ఏడీఏ ఫర్టిలైజర్స్ నర్సోజీరావు, ఏఓ జహీర్, స్పిక్ ఆర్ఎం గంగాధర్, ఆర్సీఎఫ్ మార్కెటింగ్ అధికారి పవన్, దామిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, నాడు – నేడు ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు.. అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమావేశాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల పురోగతి, ఆరోగ్యం, విద్య, ఆడుదాం ఆంధ్రా, జగనన్న సురక్ష కార్యక్రమ అమలు, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో నూరు శాతం అమలు, తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు హాజరయ్యారు.

రొట్టెల పండగకు 60 బస్సులు

నెల్లూరు సిటీ: బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగకు ప్రత్యేకంగా 60 బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసిందని జిల్లా ప్రజా రవాణా అధికారి శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి కసుమూరుకు పది, పీఎస్సార్ బస్టాండ్ నుంచి ఏఎస్‌పేటకు పది, నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, పీఎస్సార్ బస్‌స్టేషన్ నుంచి దర్గాకు ఐదు చొప్పున, వెంకటాచలం నుంచి కసుమూరుకు రెండు, ఆత్మకూరు నుంచి ఏఎస్‌పేట మీదుగా నెల్లూరుకు పది, నెల్లూరు నుంచి చెన్నై, విజయవాడ, కడపకు ఐదు చొప్పున, హైదరాబాద్‌కు మూడు బస్సులను నడపనున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


36 మంది గజ ఈతగాళ్ల ఏర్పాటు

నెల్లూరు(సెంట్రల్): రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరులోని బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు వద్ద భక్తుల రక్షణ కోసం 36 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులో రొట్టెలు మార్చుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మూడు షిఫ్టుల్లో గజ ఈతగాళ్లు విధులు నిర్వర్తించనున్నారని పేర్కొన్నారు. వీరితో పాటు మత్స్యశాఖ ప్రత్యేకాధికారులు ఏడుగురు, మరో 13 మంది ఇతర సిబ్బంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

30న మాజీ సైనికుల సంఘ సమావేశం

నెల్లూరు(బృందావనం): పారామిలటరీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని బుజబుజనెల్లూరులోని జాతీయ రహదారి పక్కన గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం మాజీ సైనికులు ఇచ్చిన అర్జీ స్థితి, సీజీహెచ్ఎస్ కార్డుల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి, తదితర అంశాలపై చర్చించనున్నామని చెప్పారు. వివరాలకు 75697 84894, 91003 39002 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పునరుద్ధరిస్తే బకింగే





పిచ్చి మొక్కలతో కళావిహీనంగా కెనాల్

బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయి. జలరవాణాలో ఒకప్పుడు కీలకంగా ఉన్న ఈ కాలువ తదనంతరం ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఈ తరుణంలో పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి చట్టాన్ని సైతం రూపొందించింది. మరోవైపు నేషనల్ వాటర్‌వేస్ ప్రాజెక్ట్ ద్వారా బకింగ్‌హామ్ కెనాల్‌ను ఎన్‌డబ్ల్యూ – 4గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది.

- శతాబ్ద కాలం పాటు సరుకుల రవాణాకు కేరాఫ్‌గా బకింగ్‌హామ్ కెనాల్
- కాకినాడ – చెన్నైను కలిపేలా ఏర్పాటు
- ఆక్రమణలతో కుచించుకుపోయిన వైనం
- జాతీయ జలమార్గంగా కేంద్ర నౌకాయాన శాఖ గుర్తింపు
- పూర్వ వైభవానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు

కాలువ పొడవు: 1,095 km

ఎక్కడి నుంచి ఎక్కడి వరకు: కాకినాడ నుంచి తమిళనాడులోని చిదంబరం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తెరచాప పడవలు, సరుకు రవాణా ఓడల రాకపోకలతో ఒకప్పుడు కళకళలాడి ప్రస్తుతం రూపు కోల్పోయిన బకింగ్‌హామ్ కెనాల్ పూర్వ వైభవం సంతరించుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీరానికి అనుసంధానంగా కాకినాడ నుంచి తమిళనాడులోని కడలూర్ జిల్లా చిదంబరం వరకు బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆంగ్లేయులు 1806లో నిర్మించారు. ఆక్రమణలతో కుచించుకుపోయి చరిత్రకే పరిమితమయ్యే దశకు చేరుకున్న కెనాల్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. దీని ద్వారా జలరవాణా వసతులు మెరుగుపడి తీర ప్రాంతాలు పారిశ్రామికంగా ప్రగతి పరుగులు తీస్తాయని భావిస్తూ కేంద్ర సాయాన్ని కోరింది.

1095 కిలోమీటర్ల మేర..

పద్దెనిమిదో శతకం నుంచి ప్రారంభమైన సరుకుల రవాణా 1965 – 70 వరకు కొనసాగింది. కాకినాడ నుంచి తమిళనాడులోని చిదంబరం వరకు దాదాపు 1,095 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. బ్రిటిష్ కాలంలో దక్షిణ భారతదేశంలో సరుకుల రవాణాలో ఈ కెనాల్ అగ్రస్థానంలో ఉండింది.

బకింగ్‌హామ్ పేరెలా వచ్చిందంటే..

1806లో దీని పేరు కొచ్చేరెన్ కాలువ. అనంతరం ఈస్టిండియా కంపెనీకి చీఫ్ కమాండర్‌గా పనిచేసిన రాబర్ట్ క్లైవ్ పేరుతో లార్డ్ క్లైవ్ కెనాల్‌గా పిలిచేవారు. 1806లో చెన్నైకు ఉత్తరాన 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎన్నోర్ వరకు బాసిల్ కొచ్చేరెన్ అనే బ్రిటిష్ అధికారి తన సొంత నిధులతో కాలువను నిర్మించారు. అనంతరం అక్కడి నుంచి పులికాట్ సరస్సు వరకు 40 కిలోమీటర్ల మేర పొడిగించారు. 1837లో ఈ కాలువను బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విజయవాడ వరకు 315 కిలోమీటర్లు.. తమిళనాడులోని మరక్కణం వరకు పొడిగిస్తూ నిర్మాణం చేపట్టారు. 1877 – 78లో చెన్నై వాసులు తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీకి గవర్నర్‌గా ఉన్న బకింగ్‌హామ్ నదుల నుంచి కొత్తగా కాలువలు తవ్వడం ద్వారా కరువు పరిస్థితులు నుంచి ప్రజలను కాపాడారు. దీంతో 1878లో కెనాల్‌కు బకింగ్‌హామ్‌గా నామకరణం చేశారు. సముద్రం పోటు మీద ఉన్నప్పుడు క్రీక్ ద్వారా సముద్ర జలాలు కాలువలోకి వచ్చేలా బ్రిటిష్ ఇంజినీరింగ్ నిపుణులు ఏర్పాట్లు చేశారు. అలా బంగాళాఖాతానికి సమాంతరంగా బకింగ్‌హామ్ కెనాల్‌ను నిర్మించారు.

నేషనల్ వాటర్‌వే – 4గా

బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు 2001లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. 2004లో సునామీ రావడంతో మరోసారి కాలువ పునరుద్ధరణకు కేంద్రం నడుంబిగించింది. అప్పట్లో ఇంజినీర్లు పరిశీలించి నివేదికను అందించారు. నాలుగో జాతీయ జలమార్గం (ఎన్‌డబ్ల్యూ – 4)గా కేంద్రం 2008లో ప్రకటించింది. కేంద్ర జలవనరుల శాఖ పరిధిలో పనిచేసే వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ద్వారా సర్వే చేయించి నివేదికను తెప్పించుకుంది.

ఆక్రమణల చెరలో..

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బకింగ్‌హామ్ కెనాల్ పరీవాహక ప్రాంతాన్ని రొయ్యలు, ఉప్పు సాగు రైతులు ఆక్రమించారు. ప్రకాశం జిల్లా పెదగంజాం నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వరకు ఆక్రమణలతో కాలువ స్వరూపమే మారిపోయింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఆరు వేల ఎకరాలను ఆక్రమించి ఆక్వా సాగు చేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 12 మండలాల్లో 169 కిలోమీటర్ల మేర కాలువ విస్తరించి ఉంది. వాహనాల రాకపోకల కోసం పలు చోట్ల కాలువలనే పూడ్చి రహదారులుగా మార్చేశారు.

సాగరమాల ద్వారా అభివృద్ధి

గోదావరి, కృష్ణా నదులతో అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడు వరకు ఉన్న జలమార్గాన్ని నాలుగో జాతీయ జలమార్గంగా ప్రకటించారు. మూడు దశల్లో పూర్తి చేయాలని కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీస్‌కు అప్పగించారు. రెండు దశలకు గానూ దాదాపు రూ.7,015 కోట్లు ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు.



మైపాడు సమీపంలో బకింగ్‌హామ్ కాలువపై నిర్మించిన వంతెన

ఇవీ ప్రణాళికలు

- ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని కృష్ణా నదిపై జగ్గయ్యపేట మండలం ముక్త్యాల – విజయవాడ నడుమ తొలి ఫేజ్ పనులను ప్రారంభించారు. 2020 జూన్ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు.
- రెండో ఫేజ్ ద్వారా విజయవాడ – పెదగంజాం మధ్య అభివృద్ధి, మూడో దశలో పెదగంజాం నుంచి తడ మండలం వరకు 258 కిలోమీటర్లు, తమిళనాడు పరిధిలోని ఎన్నోర్ వరకు నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.
- సరుకుల రవాణా ఎగుమతులు, దిగుమతుల కోసం 15 టెర్మినళ్లను నిర్మించేలా ప్రతిపాదనలను రూపొందించారు. నెల్లూరు జిల్లాలోని మైపాడు, తిరుపతి జిల్లాలోని దుగ్గరాజపట్నం, తదితర ప్రాంతాల్లో వీటిని నిర్మించాలని సంకల్పించారు. బకింగ్‌హామ్ పునద్ధరణకు ఏపీ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో 4,220 ఎకరాలను సేకరించాల్సిన అవసరం ఉంది. కాలువను పునరుద్ధరిస్తే దాదాపు 4.85 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరిగే అవకాశం ఉంది.

పోర్టులతో కనెక్టివిటీ

ఈ జలమార్గం రాష్ట్రంతో పాటు తమిళనాడు, పాండిచ్చేరితో అనుసంధానమై ఉంటుంది. కృష్ణా, గోదావరి, పెన్నాతో పాటు ఇప్పటికే ఉన్న ఆరు పోర్టులు, నిర్మాణ దశలో ఉన్న మరో నాలుగు పోర్టులకు అనుసంధానమవుతుంది. కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం, ఎన్నోర్, చెన్నై పోర్టులతో కనెక్టివిటీ కలిగి ఉండటం బకింగ్‌హామ్ కెనాల్ వైవిధ్యం. తీర ప్రాంత రవాణా పెరుగుదలతో పాటు పర్యాటకాభివృద్ధి తోడ్పడే అవకాశం ఉంది.

ఒకప్పుడు సరుకు రవాణా జరిగేది



మా చిన్నతనంలో బకింగ్‌హామ్ కెనాల్ చాలా పెద్దదిగా ఉండేది. కాలువలో పెద్ద పడవలు సరుకులను తీసుకెళ్లేవి. కాలువలో చిన్న తెరచాప, తెప్పలు, పడవలపై పక్క ఊళ్లకు వెళ్లేవాళ్లం. మా కళ్ల ముందే కాలువ వైభవం కోల్పోయింది. కాలువ అన్ని చోట్ల ఆక్రమించి రొయ్యలు గుంతలు వేస్తున్నారు.
– వైలా ఈశ్వరయ్య, మత్స్యకారుడు, మైపాడు

అనుకూలంగా ఉంటుంది



బకింగ్‌హామ్ కెనాల్ మళ్లీ అందుబాటులోకి వస్తే చాలా అనుకూలంగా ఉంటుంది. మాకు తెలిసినప్పుడు ఇక్కడ పడవలు తిరిగేవి. సముద్రంతో కాలువ అనుసంధానంగా ఉంటే మా పడవలను సైతం భద్రపర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.
– అక్కయ్యగారి కృష్ణయ్య, మత్స్యకారుడు, మైపాడు

పునరుద్ధరిస్తే ఎంతో ఉపయోగం



2016లో సర్వేను చేపట్టారు. కాలువ పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపారు. జలమార్గాన్ని పునరుద్ధరిస్తే ఎన్నో ఉపయోగాలు కలగనున్నాయి. కాలువపై ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. అలైన్‌మెంట్ ప్లాన్ అప్రూవైతే ప్రభుత్వ భూమి ఎంత ఉందో తెలుస్తుంది. దీంతో కాలువలో ఆక్రమణలను తొలగించొచ్చు.
– చేజర్ల శ్రీనివాసులు, బకింగ్‌హామ్ కెనాల్ డీఈఈ

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో కేన్సర్ సెంటర్లు



అధునాతన పరికరాలను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, పక్కన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

నెల్లూరు(బారకాసు): కేన్సర్ వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగా ఆధునిక టెక్నాలజీతో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో కేన్సర్ సెంటర్లను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తోందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పొదలకూరు రోడ్డులో గల రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్, సీటీ స్కాన్, సోలార్ పవర్ సిస్టమ్, ఐసీయూ వార్డు, ఆర్వో ప్లాంట్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరులో రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్ కోసం ఏడెకరాలను దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో కేటాయించారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కేన్సర్ వైద్యసేవలను పేదలు పొందే అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని కొనియాడారు.

దాతల సాయం చాలా గొప్పది

నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం గొప్ప విషయమని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. అధునాతన యంత్ర పరికరానికి ఓ దాత రూ.14 కోట్ల విరాళాన్ని ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, ట్రెజరర్ సురేష్‌కుమార్‌జైన్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రొట్టెల పండగ

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): మతసామరస్యానికి ప్రతీక రొట్టెల పండగ అని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బారాషహీద్ దర్గాలో ఈ నెల 29 నుంచి ఆగస్టు రెండు వరకు నిర్వహించనున్న రొట్టెల పండగ నిర్వహణకు సంబంధించిన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రొట్టెల పండగకు విచ్చేసే వారికి సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. పండగకు ఆదరణ నానాటికీ పెరుగుతోందని తెలిపారు. రానున్న కాలంలో బారాషహీద్ దర్గాను మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. బారాషహీద్ దర్గాతో పాటు జిల్లాలోని కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలు మతసామరస్యానికి కేంద్ర బిందువులని చెప్పారు. రొట్టెల పండగ కమిటీలోని సభ్యులు, అధికారుల సహాయ సహకారాలతో జయప్రదం చేయాలని కోరారు. తొలుత బారాషహీదుల సమాధుల వద్ద ప్రత్యేక దువా చేశారు. అనంతరం దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వక్ఫ్ కమిటీ చైర్మన్ మీరా, కార్పొరేటర్ కరిముల్లా, మొబీనా, పండగ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ ఖాదరి, ఉపాధ్యక్షుడు మస్తాన్, మైనార్టీ నేతలు రియాజ్, కంతర్ అలీ, అబూబకర్, సమీర్, బాబులు, షానవాజ్, జిలానీ, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్య వరం

- కలెక్టర్ హరినారాయణన్
- 19 మంది విద్యార్థులకు రూ.2.67 కోట్ల లబ్ధి



నమూనా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న విదేశీ విద్య పథకం విద్యార్థులకు వరమని, జిల్లా నుంచి ఎంపికైన 19 మందికి ఈ విడతలో రూ.2.67 కోట్ల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్య నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో నమూనా చెక్కును జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్ చక్రవర్తి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, కలెక్టర్, తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశాల్లో విద్యనభ్యసించే అవకాశం కలగడం వరం లాంటిదన్నారు. విదేశాల్లోని టాప్ వర్సిటీల్లో సీటు పొందిన పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విమాన, వీసా ఖర్చులనూ ప్రభుత్వమే భరించనుందని చెప్పారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అమ్మఒడి, విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య లాంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం ద్వారా కొంతమందికే అరకొరగా ఫీజులను చెల్లించేవారని చెప్పారు.

చాలా ఆనందంగా ఉంది



న్యాయవాద కోర్సులో గోల్డ్ మెడల్‌ను సాధించాను. విదేశాల్లో మాస్టర్స్ చదవాలనే కోరిక ఉండేది. అయితే ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరమై వెళ్లలేకపోయాను. ఈ క్రమంలో జగనన్న విదేశీ విద్య పథకం ద్వారా లండన్‌లోని క్వీన్‌మేరీ వర్సిటీలో న్యాయవాద కోర్సులో మాస్టర్స్ చేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. సీఎంకు కృతజ్ఞతలు
– అమియా మొబీన్, నెల్లూరు

సీఎంకు రుణపడి ఉంటా



నేను రైతు కుటుంబానికి చెందిన వ్యక్తిని. న్యూయార్క్‌లో ఎమ్మెస్ చేసేందుకు రూ.కోటిని సీఎం చెల్లించారు. విదేశాల్లో చదవాలనే నా కోరిక తీరింది. విద్యార్థుల కలలను సాకారం చేస్తున్న సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం.
– రేమాల శబరీష్‌రెడ్డి, కావలి

తగ్గుముఖం పట్టిన నేరాలు



మాట్లాడుతున్న రాజేంద్రనాథ్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టడంతో రాష్ట్రంలో ఈ ఏడాది నేరాలు 30 శాతం తగ్గాయని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నుంచి నెల్లూరొచ్చిన ఆయన స్థానిక ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా భౌగోళిక స్థితిగతులు, పోలీస్ స్టేషన్లు, అధికారుల వివరాలు, శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల వివరాలు, సిబ్బంది సంక్షేమానికి చేపడుతున్న చర్యలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి వివరించారు. అనంతరం విలేకరులతో డీజీపీ మాట్లాడారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించానని, ఆయా జిల్లాల్లో నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. దిశ యాప్‌తో మహిళలకు సంపూర్ణ రక్షణ లభిస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా 1.24 కోట్ల మంది యాప్‌ను రిజిస్టర్ చేసుకున్నారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో సోషల్ మీడియా మానిటరింగ్ సెల్లను ఏర్పాటు చేశామని.. సామాజిక మాధ్యమాల వేదికగా వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, బ్యాంక్ మోసాలు, తదితరాలపై నిఘాను ఉంచామని వెల్లడించారు. నెల వ్యవధిలో 45 మంది అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని జైలుకు పంపామని పేర్కొన్నారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్ట్‌లు వైఎస్సార్, జగన్ చలువే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- సంగం, పెన్నా బ్యారేజీలే నిదర్శనం
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: వైఎస్సార్, జగన్ చలువ వల్లే నీటి పారుదల ప్రాజెక్ట్‌లు సాకారమైందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని చంద్రశేఖరపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివంగత వైఎస్సార్ జలయజ్ఞం పేరుతో నీటి పారుదల రంగానికి ప్రాధాన్యతనిచ్చి ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్ట్‌లు తెచ్చినట్లు గుర్తుచేశారు. ఆయన వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డి నీటి ప్రాజెక్ట్‌లకు నిధులు కేటాయిస్తూ రైతాంగానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అందుకు జిల్లాలోని పెన్నా, సంగం బ్యారేజీలే నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌లకు వైఎస్సార్ నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తే తరువాత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వాటిని గాలి కొదిలేశారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ రెండు బ్యారేజీలను పూర్తి చేసి ప్రారంభించారని తెలిపారు. రైతాంగానికి చంద్రబాబు చేసింది శూన్యమని చెప్పారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే కృష్ణపట్నం పోర్టును మంజూరు చేయించారని తెలిపారు. ఎన్నికలప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక గాలి కొదిలేసే నైజం చంద్రబాబుదని దుయ్యబట్టారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జ్యోతి, ఎంపీటీసీ అరుణకుమారి, సర్పంచ్ లక్ష్మయ్య, నాయకులు బి.వెంకయ్యనాయుడు, వెంకట నగేష్‌నాయుడు, జి.మస్తానయ్య, టి.తిరుపతి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరికలు

- సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని 53వ డివిజన్‌కు చెందిన టీడీపీ మాజీ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ ఆదిశేషయ్య, టీడీపీ నేత నల్లబోయి మల్లికార్జున్, వారి మిత్రబృందంతో పాటు బీజేపీ నేత దాసరి శ్రీను, వారి మిత్రబృందం, సీపీఎం నేత రాగాల శీనయ్య, వారి మిత్రబృందం, కాంగ్రెస్ నేత కొమరగిరి రమణయ్య, వారి మిత్రబృందం కలిపి దాదాపు 100 మంది నగరంలోని రాజన్న భవన్‌లో ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రౌడీషీటర్లను పార్టీలో చేర్చుకుంటున్నారని ఓ వ్యక్తి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ పార్టీలో ఉంటే మంచివారు, మా పార్టీలో చేరితే రౌడీషీటర్లు అని అనడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలో చేరిన వారిలో దేవరకొండ అక్షయ్‌బాబు, సీహెచ్ చంటి, కోనేటి గోపాల్, డి.రవీంద్రబాబు, ఎస్.అరుణ్, డి.రమణయ్య, ఏసు, ఎం.రాజమ్మ, ఆర్.భాగ్యలక్ష్మి, నారాయణమ్మ, రాజా, కె.భాగ్యలక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ సుజాత, వైఎస్సార్‌సీపీ నేత బి.వెంకటరమణ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పేదల జీవితాల్లో నవరత్నాల వెలుగులు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు : నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు మండల పరిధిలోని నార్త్ ఆములూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఇంటింటికీ గర్వంగా తిరుగుతున్నామని తెలిపారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో తమను ఆహ్వానిస్తున్నారన్నారు. అందరికీ మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2024 ఎన్నికల్లో ప్రజలు మద్దతు పలకాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 33 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అందించి చరిత్ర సృష్టించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ కరిముల్లాషాఖాదర్, వైఎస్సార్‌సీపీ నేతలు నీలం సాయికుమార్, ఉస్మాన్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధక్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సురేంద్రబాబు, చల్లా ఇంద్రసేన, పాడేటి డేవిడ్, మందపల్లి శేషయ్య, పులయ్య, నిమ్మల భాస్కర్, మనోహర్, డి.వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు, మధురెడ్డి, తాండ్ర మల్లి, సుధ, జంషీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రికార్డు స్థాయిలో పొగాకు ధర

కందుకూరు: పొగాకు వేలంలో రికార్డు ధర కొనసాగుతూనే ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది పొగాకు రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయి. నిన్నటి వరకు రూ.250 ఉన్న కేజీ పొగాకు గురువారం ఒక్కరోజే కేజీ రూ.19 పెరిగి రూ.269ల రికార్డు ధర నమోదు చేసింది. వేలం చివరి దశకు చేరుతున్న కొద్దీ వ్యాపారులు పోటీ పడుతుండడంతో అధిక రేట్ల పరంపర కొనసాగుతోంది. కందుకూరు–1వ వేలం కేంద్రంలో 940 బేళ్లు వేలానికి ఉంచగా 864 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 950 బేళ్లు వేలానికి ఉంచగా 869 బేళ్లు అమ్ముడుపోయాయి. కేజీ పొగాకు అత్యధిక ధరలు వరుసగా రూ.268, రూ.269 నమోదయ్యాయి. అత్యల్ప ధరలు రూ.150, రూ.160గా వచ్చాయి. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధరలు కావడం గమనార్హం.

అతిగా మద్యం తాగి..

- వ్యక్తి మృతి

కోవూరు : అతిగా మద్యం తాగిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన పడిపోయాడు. పోలీసులు గుర్తించి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటన పడుగుపాడు వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పడుగుపాడు మసీదు సమీపంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఓ వ్యక్తిని పోలీసులు గుర్తించారు. ఆస్పత్రికి తరలించేందుకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడని, అతను స్థానికంగా వెల్డింగ్ పనులు చేసుకునే షేక్.నాగూరువలి(40)గా గుర్తించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

సైదాపురం : మండలంలోని చీకవోలు గ్రామంలో తోటలో పనిచేస్తున్న పాట్లేళ్ల కోటయ్యపై గురువారం అడవి పంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. కోటయ్య రోజులానే తోట పనికి వెళ్లాడు. అయితే అక్కడే ఉన్న అడవి పంది ఒక్కసారిగా కోటయ్యపై దాడి చేసింది. దీంతో ఆయన గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, వారు గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దుకాణాల్లో తనిఖీలు

గూడూరురూరల్ : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తూనికలు, కొలతల శాఖ అధికారులు గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, నారాయణమ్మవీధి, రూరల్ ప్రాంతంలోని చెన్నూరులో పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ దాడులు చేశారు. ఎరువులు, బియ్యం, కంది పప్పు, వంటనూనె ప్యాకెట్ల తూకాల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

గంజాయి కట్టడికి పీడీ యాక్ట్

- ఇప్పటికే ఐదుగురిపై ప్రయోగం
- తాజాగా మరో నలుగురిపై..
- నాలుగేళ్లలో 283 మంది అరెస్ట్
- 1479.91 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ(ఫైల్)

నెల్లూరు(క్రైమ్) : గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఏఎస్పీ, జిల్లా సెబ్ అధికారిణి డి.హిమవతి చర్యలు చేపట్టారు. పక్కా ప్రణాళికలతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు చేస్తూ అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపుతున్నారు. దాడులు చేశాం.. కేసులు నమోదుచేశాం.. అని సరిపెట్టుకోకుండా మూలాల ఏరివేత దిశగా చర్యలు చేపట్టారు. దాడుల్లో పట్టుబడిన నిందితుల నుంచి ఎక్కడ? ఎవరి వద్ద? ఎవరి ద్వారా గంజాయిని కొనుగోలు చేశారు.. అనే పూర్తి వివరాలు సేకరించి సరఫరాదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. సాంకేతికత ఆధారంగా వారిని గుర్తించి అరెస్ట్‌లు చేస్తున్నారు. జిల్లాలో కేసులు నమోదై ఇప్పటికే వివిధ రాష్ట్రాల జైళ్లలో ఉన్న సరఫరాదారులను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని అరెస్ట్‌లు చేస్తున్నారు. సెబ్ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 114 కేసులు నమోదు చేసి 283 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1479.91 కేజీల గంజాయిని, నాలుగు కేజీల హాషిష్ ఆయిల్, రెండు గంజాయి చెట్లను, తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఏఓబీ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి సరఫరాదారులను పదుల సంఖ్యలో అరెస్ట్ చేశారు. గంజాయి రవాణా, విక్రయదారులే కాదు సేవించేవారిపై సైతం కేసులు నమోదు చేస్తున్నారు. పదేపదే దాడుల్లో పట్టుబడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరిలో మార్పు రాకపోవడంతో అక్రమార్కులపై పీడీయాక్ట్‌లు ప్రయోగిస్తున్నారు. తాజాగా మరో నలుగురిపై పీడీయాక్ట్‌లు ప్రయోగించారు. ఇప్పటివరకు అరెస్ట్ అయిన వారిలో 108 మంది కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. నిందితులు ఎక్కడ ఉన్నా వదిలే ప్రసక్తే లేదని తమ చర్యలు ద్వారా నిరూపిస్తున్నారు. పోలీసుబాస్ చర్యలతో అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. దీంతో జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణా క్రమేపి తగ్గుముఖం పడుతోంది.

కఠిన చర్యలు...

గతంలో ఎనిమిది మంది ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసు అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేరగాళ్లపై ఉదాసీనత వీడి కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. ప్రభుత్వ ఆదేశాలు అమలులో భాగంగా జిల్లాలో గతేడాది నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడుతోన్న బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన ముగ్గురిపై, పదేపదే నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్న కరుడుగట్టిన ఏడుగురు రౌడీషీటర్లపై పీడీయాక్ట్ ప్రయోగించారు. ఈ ఏడాది మేలో గంజాయి అక్రమరవాణా, విక్రయాలకు పాల్పడుతోన్న కపాడిపాళేనికి చెందిన అరవ రాజమ్మ, షేక్ సిరాజ్, షేక్ సుభాని, షేక్ ముంతాజ్, వెంగళరావ్‌నగర్‌కు చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లుపై పీడీయాక్ట్ ప్రయోగించారు.



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ (ఫైల్)

తాజాగా..

తాజాగా మరో నలుగురు గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్‌లు నమోదు చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

➡ నెల్లూరు బోడిగాడితోట అవరపాళేనికి చెందిన అరవ చిన్నరాజపై నెల్లూరు నగరం, కోవూరు, కావలి సెబ్‌స్టేషన్‌లు, నవాబుపేట పోలీసుస్టేషన్‌లలో కేసులున్నాయి.

➡ కందుకూరు పట్టణం బండపాళేనికి చెందిన గురునాథం చిన వెంకటేశ్వర్లుపై కందుకూరు పట్టణ పోలీసుస్టేషన్‌తో పాటూ కందుకూరు సెబ్‌స్టేషన్‌లో కేసులున్నాయి.

➡ నెల్లూరు కపాడిపాళేనికి చెందిన షేక్ జమీర్‌పై సంతపేట పోలీసుస్టేషన్‌లో రెండు, నెల్లూరు ఎస్ఈబీ స్టేషన్‌లో రెండు, కావలి సెబ్‌స్టేషన్‌లోనూ కేసులున్నాయి.

➡ నెల్లూరు వెంగళరావ్‌నగర్‌కు చెందిన షేక్ సలీంపై నెల్లూరు నగరంతో పాటు నెల్లూరు సెబ్‌స్టేషన్‌లో రెండు కేసులు, కావలి సెబ్ స్టేషన్‌లోనూ కేసులున్నాయి.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం

గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. గంజాయి అక్రమరవాణా, విక్రయాలకు పాల్పడుతోన్న ఐదుగురిపై ఇప్పటికే పీడీ యాక్ట్ నమోదు చేశాం. తాజాగా మరో నలుగురిపై పీడీయాక్ట్ ప్రయోగించాం. ప్రజలు తమ ప్రాంతాల్లో గంజాయి అక్రమరవాణా, విక్రయాలు, సేవనం జరుగుతున్నట్లు గుర్తిస్తే 14500, డయల్ 100, 112లకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

చంద్రబాబును ప్రజలు నమ్మరు



అర్జీదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

- కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు రూరల్ : నిన్న మొన్నటి వరకు సంక్షేమ పథకాలను పప్పుబెల్లాల్లా పోల్చినవారు నేడు అవే పథకాలను మరో రూ.5 వేలను పెంచి ఇస్తామంటున్నారని, అయినా అయన్ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని జి.మేకపాడులో గురువారం జగనన్న సురక్ష శిబిరం జరగ్గా, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఆనాడు హేళన చేసిన చంద్రబాబు.. ఇప్పుడు అదే పథకాలను తాము అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. సంక్షేమ పాలనను కొనసాగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, 2024లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు 100 శాతం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, సహాయ వ్యవసాయ సంచాలకుడు పి.అనసూయ, ఎంపీడీఓ పి.విజయశేఖర్, తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, వ్యవసాయాధికారి వి.రాము, సర్పంచ్ జి.బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ బి.నాగేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీని ఢీకొన్న లారీ

- డ్రైవర్ దుర్మరణం

గుడ్లూరు: ముందు వెళ్తున్న ట్రాలీని ఓ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన గుడ్లూరు మండలంలోని జాతీయ రహదారిపై మోచర్ల వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు నుంచి ఒంగోలుకు వెళ్తున్న ట్రాలీ మోచర్ల వద్ద తూర్పు వైపున ఉన్న పెట్రోలు బంకులో డీజిల్ పట్టించుకునేందుకు యూటర్న్ తీసుకుంటోంది. అదే సమయంలో కృష్ణపట్నం పోర్టు నుంచి పామాయిల్ లోడుతో ఒంగోలు వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ట్రాలీని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ నల్లమోతుల సిద్దార్థ(45)కు తీవ్రగాయాలై క్యాబిన్‌లో ఇరుక్కొని మృతిచెందాడు. అలాగే ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ కూడా ట్రాలీ ముందు భాగాన్ని ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గంట పాటు శ్రమించి సిద్దార్థ్‌ను బయటకు తీశారు. అయితే అప్పటికే అతను మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

- ఇన్‌చార్జి రేంజర్ భాస్కర్‌రెడ్డి

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఇన్‌చార్జి రేంజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. డీవీ సత్రంలో వన్యప్రాణి విభాగం అధికారుల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పక్షుల కేంద్రంలోని చెరువు కలుజు నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఈ క్రమంలో కలుజు నిర్మాణానికి అవసరమైన రూ.24 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, కమిటీ ద్వారా తీర్మానించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. అలాగే పక్షుల కేంద్రంలో అక్టోబర్ నుంచి పక్షుల రాక మొదలవుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు కూడా ఇప్పటి నుంచే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ డి.గోపాల్ రెడ్డి, సర్పంచ్ రామయ్య, ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఏఓ రఘురావయ్య, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేను సందర్శించిన డీఏఓ

సైదాపురం : మండలంలోని లింగనపాళెంలో రైతు భరోసా కేంద్రాన్ని నెల్లూరు జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సుధాకర్‌రాజు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఉద్యానశాఖ సిబ్బంది పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఓ హైమావతి ఉన్నారు.

31న జగనన్నకు చెబుదాం రద్దు

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు నగరంలో ఈ నెల 29వ తేదీ నుంచి 5 రోజులపాటు రొట్టెల పండగ జరగనున్న నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో జరిగే 'జగనన్నకు చెబుదాం(స్పందన)' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొట్టెల పండగ విధుల్లో జిల్లా అధికారులు పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో మినహా అన్ని మండల, డివిజన్‌స్థాయి కార్యాలయాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

కండలేరులో 17.871 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 17.871 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. వరదకాలువ ద్వారా కండలేరు జలాశయానికి వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,060 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 60 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 124
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 150

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7